# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

FEBRUARY - 1999

# సంక్షిప్త వార్తలు

1999 జనవరి 3వ తేదీ ఆదివారం నాడు విజయనగరం జిల్లా చీపురుపల్లిలో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును సోదరులు యమ్. పాల్‌రాజు గారు, హెర్షల్ బియర్డెన్ గారు, జాషువా గూటం గారు కలిసి రిబ్బను కత్తిరించి ప్రారంభోత్సవమును జరిపించిరి. ఆనాడు జరిగిన కూటమునకు జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరైరి. పలువురు స్వదేశీ, విదేశీ సోదరులు వాక్య పరిచర్య చేయగా 19 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

జనవరి 17 నుండి 21వ తేదీవరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ వారు నిర్వహించిన 14వ గొప్ప బైబిలు సెమినార్ అత్యంత ఘనముగా జరిగెను. మొదటిరోజు నుండి చివరిరోజు వరకు అనేక ప్రాంతములనుండి, రాష్ట్రాలనుండి వచ్చిన ప్రజలతో స్కూల్ ఆవరణ నిండియుండెను. సోదరులు జాన్‌ఫోర్డ్, బిల్‌మెయర్స్, కె.స్వామిదాస్ (కలకత్తా), జాషువా గూటం, డాక్టర్ జాన్ బెయిలీ, రోయస్‌ఫ్రెడరిక్, హెర్షల్ బియర్డెన్, రస్సెల్‌బెల్, మైక్‌న్యూహోస్, కె.రమేష్, ఫ్రాన్సిస్ డేవిడ్ (న్యూఢిల్లీ), ఉబేదలిమ్మా, పత్రాస్‌బాగ్‌లు వాక్య పరిచర్య చేసిరి. ఆంగ్ల భాషలో చేయబడిన ఉపన్యాసములను తెలుగునకనువదించుటలో సోదరులు టి.వి.యన్ కుమార్, ఆర్.సి.హెచ్ సద్గుణరావ్, టి.నోబుల్‌రాజు ఆనంద్, పీటర్‌నాగ్, జాషువాగూటం, మరియు నెహెమ్యా గూటం గార్లు సహకరించిరి.సెమినార్ కొరకు ప్రత్యేకముగా ముద్రించబడిన కీర్తనలను సోదరులు గంటా ఫిలిప్ గారు చక్కగా నడిపించిరి.

సెమినార్‌కు హాజరైన వందలాది ప్రజలకు చక్కని భోజన వసతి సౌకర్యములు కల్పించబడెను. ప్రజలకు ఆత్మీయాహారమే గాకుండా, భౌతికంగా కూడా అవసరమైన శాఖాహారము, మాంసాహారము కూడ రుచికరముగా, శుచిగా సమయానికి సరఫరా చేయబడెను. ప్రశాంత వాతావరణములో ప్రజలు గొప్ప

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 ఫిబ్రవరి 1999 సంచిక 7


## సంపాదకీయం

### బైబిలు మూలపాఠం : సిలువ వేయబడిన క్రీస్తు
### ( Christ Crucified - The Theme of the Bible )

పరిచయము : క్రీస్తు మానవుని పాపములకు ప్రాయశ్చిత్తము కావాలని, తద్వారా మానవుని తనతో సమాధాన పరచుకోవాలని దేవుని యొక్క నిత్య సంకల్పమై యుండెను. మానవుని పాపములు దేవునినుండి అతని వేరు చేసాయి గనుక మానవుడు దేవునితో సమాధానపడవలసి యున్నది. అందువలన మానవులందరి కొరకు మరణించుటకు క్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. ఆయన రక్తము వలన మానవులందరి పాపములు పరిహరింపబడును (యోహాను 3:16; రోమా 5:8-11 చదువుము). అది "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున" యుండెను (ఎఫెసీ 3:11).

సిలువ వేయబడిన రక్షకుడు అను బోధను బట్టి మిగతా మతముల కంటే

క్రైస్తవ్యము భిన్నముగా యున్నది. లోకములో యున్న ఆయా మతాలలోను, క్రైస్తవ్యములోను కూడ కొన్ని నైతిక, ఆధ్యాత్మిక సూత్రములు సమానముగ యున్నను, రోమా ప్రభుత్వ సిలువపై సిలువ వేయబడిన రక్షకుడు క్రైస్తవ్యములో ప్రత్యేకముగా యున్నాడు. అందువలన క్రైస్తవ్యము ఏకైక మతమై యుండి, క్రీస్తు ఒక్కడు మాత్రమే ముక్తి మార్గమై యున్నాడని అది లోకమునకు చాటుచు యున్నది.

## ఎందువలన ?

బైబిలు ఒక వ్యక్తిని గూర్చిన కథనము అని తరుచు చెప్పబడుతూ యుంటాది: రాబోవుచున్న ఒక వ్యక్తిని గూర్చి పాత నిబంధన చెప్పుచున్నది; వచ్చిన ఆ వ్యక్తిని గూర్చి, మరల రాబోవుచున్న ఆ వ్యక్తిని గూర్చి క్రొత్త నిబంధన చెప్పు చున్నది. అయితే ఆయన రావడం, వెళ్లడం, మరల రావడం వలన మానవజాతికి ఏ ప్రయోజనము లేకపోతే ఈ రాకపోకల ప్రయోజనం శూన్యం. అయితే ఆయన వచ్చి మానవుడు తనకుగా తాను చేసుకొనలేని దానిని సాధించితే అదిచాల గొప్ప సంగతి. ఆయన వచ్చి అనేకమైన ఆశ్చర్య కార్యములు చేయునని ముందుగనే ప్రవచింపబడెను.

మానవుడు తనకుగా తాను అర్పించుకో లేనిది యేమున్నదంటే, రక్తము అని చెప్పవచ్చును. "రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదని" బైబిలు చెప్పుచున్నది (హెబ్రీ 9:22). మరియు "ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10:4). అంటే జంతువుల రక్తము మానవుని పాపములను తీసివేయలేదు. అట్లాగని నరబలి ద్వారా మానవుని పాపములు కూడ పరిహరింపబడవు, ఏలయనగా దేవుడు నిర్దోషమైన, పరిపూర్ణమైన బలిని కోరుచున్నాడు. బలిరూపముగా దేనినైనా "యెహోవాకు తెచ్చినప్పుడు అది అంగీకరింపబడునట్లు దోషము లేనిదై యుండవలెను. దానిలో కళంకమేదియు నుండకూడదు" (లేవీ 22:21). నరుడు నిర్దోషికాదు. పాపము లేని మానవుడు

ఎవడు లేడు (రోమా 3:23). అందువలన పరిపూర్ణుడగు దేవుని కుమారుడైన యేసుక్రీస్తు, ఆయన దైవ మానవుడై యుండి దేవునికి అంగీకార యోగ్యమైన బలిగా తన్నుతాను అర్పించుకొనెను (1పేతురు 1:18-19). అందువలనే సిలువవేయబడిన క్రీస్తు బైబిలు యొక్క మూల పాఠమాయెను. గనుకనే "మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము" అని అపొ.పౌలు చెప్పెను (1కొరింథీ 1:23).

గమనిక : ఈ లోకములో రకరకాల మతనాయకులు, ప్రవక్తలు వచ్చి, ప్రజల విమోచన మార్గము తమకు తెలుసని, ప్రజలు వారినే వెంబడించాలని ప్రకటించు కొనిరి. ఈ నాయకులు బలహీనులును, కళంకితులగుటచే కేవలం మాటలు మాత్రమే చెప్పారు గాని మానవుజాతిని విమోచించుటకు ఏమియు చేయలేక పోయారు. అయితే యేసుక్రీస్తు యొక్క మరణము యితరులెవరూ చేయలేని దానిని మానవజాతికి చేసింది. మానవుని పాపములకు ప్రాయశ్చిత్తమును, పరిహారార్ధమును గావించింది. యేసుక్రీస్తు పరిపూర్ణ దేవుని కుమారుడగుటచే యిది సాధ్యమయ్యింది. మానవునికున్న గొప్ప అవుసరం-సలహాపూరితమైన మాటలు కాదు, గాని పాపపరిహారార్ధ బలి! క్రీస్తు మానవునికి బదులుగా మానవుని కొరకు బలియాయెను. అందువలన ఈ భూమిపై ఉద్భవించిన మత నాయకు లందరికీ భిన్నముగా క్రీస్తువున్నాడు. ఏలయనగా మానవుని కొరకు చనిపోవుటకు ఆయన ఈ లోకమునకు వచ్చెను. ఆయన పొందిన మరణములో మనయెడల ఆయనకున్న గొప్ప ప్రేమను వెల్లడిపరచెను; "తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు" (యోహాను 15:13). యేసుక్రీస్తు తప్ప మరొక మతనాయకుడెవడైనా, తన అనుచరుల కొరకు ప్రాణము పెట్టిన వాడెవడైనా యున్నాడా ? అతడు మంచి మనస్సు గలవాడే అయ్యుండ వచ్చును, తన అనుచరులను గాఢంగా ప్రేమించిన వాడై యుండవచ్చును. గాని వారిని విమోచించుటకు తన ప్రాణము పెట్టిన మతనాయకుడెవడైనా యున్నాడా?

క్రీస్తు తప్ప యెవడును లేడు !

## ఎట్లు

బైబిలు సంఘటనలు సిలువ వేయబడిన క్రీస్తులో మిళితమవుచున్నాయి : పాతనిబంధన : ఆదికాండము 3:15లో స్త్రీ సంతానము సర్పము (సాతాను) యొక్క తలనుకొట్టును అని చెప్పబడింది. (క్రీస్తుకు భూసంబంధమైన తండ్రి యెవడును లేడు గనుక ఆయన ఒక్కడు మాత్రమే స్త్రీ సంతానమని సత్యముగా చెప్పబడవచ్చును). అయితే ఆ పనిలో సాతానుడు ఆయన మడిమెమీద కొట్టునని కూడ చెప్పబడినది. యేసుక్రీస్తు సిలువపై చనిపోయినప్పుడు మానవపాపములకు విరుగుడు ననుగ్రహించుచు, సాతాను బలమునకు చావుదెబ్బ కొట్టెను. అందువల ననే అది సర్పము యొక్క తలను చితుక గొట్టుట యని చెప్పబడినది. అయితే యేసుక్రీస్తు కూడ ఈ కార్యములో చంపబడినందున, ఆయన మడిమె మీద సాతానుడు ఎట్లు కొట్టాడో మనము ఇప్పుడు గ్రహించుకొనగలము.

క్రీస్తు పూర్వము 700 సంవత్సరముల కాలములో చేయబడిన ప్రవచనములలో, "అతవి నలుగగొట్టుటకు యెహోవాకు యిష్టమాయెను" అని యెషయా చెప్పెను (యెష 53:10). ఆదికాండములో "మడిమె మీద కొట్టుట", యెషయాలో "నలుగగొట్టుట" అను మాటలు సిలువపై క్రీస్తుయొక్క మరణమును గూర్చి చెప్పబడినవి. ఇదే భావమునిచ్చు పలు పదములను ప్రవక్తయైన యెషయా వినియోగించెను. యెషయా 53:3-12 లను చదువుము.

| | | |
|---|---|---|
| తృణీకరింపబడెను | ..... | సిలువ వేయబడెను |
| విసర్జింపబడెను | ..... | సిలువవేయబడెను |
| మొత్తబడెను | ..... | సిలువవేయబడెను |
| గాయపరచబడెను | ..... | సిలువవేయబడెను |

5.

నలుగ గొట్టబడెను ..... సిలువవేయబడెను

సమాధానార్థ శిక్ష భరించెను ..... సిలువవేయబడెను

దౌర్జన్యము నొందెను. ..... సిలువవేయబడెను

మొత్తబడెను ..... సిలువవేయబడెను

భూమిలోనుండి కొట్టివేయబడెను ..... సిలువవేయబడెను

భక్తిహీనులతో సమాధి నియమిపంబడెను ..... సిలువవేయబడెను

అతిక్రమము చేయువారిలో ఎంచబడెను ..... సిలువవేయబడెను

తన ప్రాణమును ధారపోసెను ..... సిలువవేయబడెను

అనేకుల పాపములను భరించెను ..... సిలువవేయబడెను

ఆయన శరీరము (కాళ్లు, చేతులు) పొడవ బడునని జెకర్యా, దావీదులు ముందుగనే ప్రవచించిరి (జెకర్యా 12:10; కీర్తన 22:16).

ఆయన యెముకలలో ఒక్కటియైనను విరగిపోదని కీర్తనల గ్రంధకర్త వ్రాసెను (కీర్తన 34:20; నిర్గమ 12:46).

ఈ రీతిగా పాతనిబంధన సందర్భములన్నియు యెరూషలేము వెలుపలయున్న ఒక కొండయొద్దకు మనలను నడిపించుచున్నవి. అక్కడ క్రీస్తు పాపియైన మానవుని రక్షణార్థము తన రక్తమును చిందించెను. బైబిలు మానవుని విమోచనార్థమైన దేవుని సంకల్పమును తెలియజెప్పుచున్నదనుట నిస్సందేహము. ఆ సంకల్పములో సిలువవేయబడిన క్రీస్తు కేంద్రబిందువై యున్నాడు.

## 6.

# ఛాయారూపకమైన మోషే యుగము

మోషే ధర్మశాస్త్ర ప్రకారమైన యూదా మత పద్ధతిలో నున్న గొప్ప విశేష మేమంటే దానిలో అనేక సంగతులు ఛాయా రూపకముగా యున్నట్లగుపడును. వాటి నిజస్వరూపము తదనంతరము అగుపడును. పాతనిబంధనలో ఛాయా రూపకముగా యున్న సంగతులను గూర్చి వాటి నిజస్వరూపము క్రొత్తనిబంధనలో యగుపడుటను గూర్చి క్రొత్తనిబంధన లేఖకులు తరుచు ప్రస్తావించుట మనము చూడగలము.

ఉదాహరణకు క్రొత్తనిబంధనలో వాడబడిన 'ఛాయ' అనుమాట, ఒక విజవస్తువు లేక జరగుబోవు సంఘటన యొక్క మచ్చు ( Sample ) లేక సూచన యని చెప్పుకోవచ్చును. ఈ ఛాయ, నిజస్వరూపముల యొక్క ఉదాహరణలు దిగువనీయబడినవి :

- కొలస్స 2:16-17లో అపొ.పౌలు అన్నపానములు, పండుగ అమావాస్య, విశ్రాంతి దినము మొదలగు వాటిని గూర్చి చెబుతు, అవి రాబోవు వాటి ఛాయయే యని చెప్పాడు.

- హెబ్రీ 8:1-5లో లేఖకుడు యాజకులు అర్పించు అర్పణలు, బలులను గూర్చి చెబుతు " ఈ యాజకులు పరలోక సంబంధమగు వస్తువుల ఛాయా రూపకమైన గుడారమునందు సేవ చేయుదురు" అని చెప్పాడు.

- హెబ్రీ 10:1లో "ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయ గలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలది కాదు గనుక ఆ యాజకులు ఏటేట ఎడ తెగకుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని తెచ్చు వారికి ఎప్పుడు సంపూర్ణ సిద్ధికలుగజేయనేరవు" అని చెప్పబడియున్నది.

ఈ రీతిగా పాతనిబంధనలోని అనేక సంగతులు నిజస్వరూపములు కావు గాని, రాబోవు వాటియొక్క ఛాయ, ముందు సూచన, మచ్చు మాత్రమే యని గ్రహించుకోగలము. అందువలననే "క్రీస్తునొద్దకు నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెనని" పౌలు ఉద్ఘాటించెను (గలతీ 3:24).

ఈ ఛాయ నిజస్వరూపముల యొక్క పద్ధతి ధర్మశాస్త్రము యొక్క బల్యర్పణ పద్ధతిలో మరింత విపులముగా కనబడును.

| | |
|---|---|
| - బలిగా అర్పించబడే గొర్రెపిల్ల నిర్దోషమైనది, మచ్చలేనిదై యుండవలెను (నిర్గమ 12:5). | - క్రీస్తు ఆ గొర్రెపిల్ల (1పేతురు 1:19). |
| - దాని యెముకలలో యేదీ విరుగ కూడదు (నిర్గమ 12:46). | - క్రీస్తు యెముకలలో యేదీ విరుగ లేదు (యోహాను 19:33) |
| - జంతువుల రక్తము (హెబ్రీ 10:4). | - క్రీస్తు యొక్క రక్తము (హెబ్రీ 9:14). |
| - జంతు బలులు (నిర్గమ 12అధ్యా). | - క్రీస్తు యొక్క బలి (హెబ్రీ 9:26; 10:10). |
| - జంతువుల యొక్క కళేబరములు పాళెమునకు వెలుపట అగ్నితో కాల్చబడుట (నిర్గమ 29:14; సంఖ్యా 19:3). | - క్రీస్తు కూడ యెరూషలేము గవిని వెలుపట శ్రమపొందెను (హెబ్రీ 13:12). |
| - బలి పశువైన మేక ప్రజలందరి పాపములను, దోషములను భరించుట (లేవీ 16:20-22). | - క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించెను (హెబ్రీ 9:28). |

ఈ ఉదాహరణలను బట్టి "ఇదిగో లోక పాపమును మోసికొనుపోవు దేవుని గొర్రెపిల్ల" యని బాప్తిస్మమిచ్చు యోహాను యేసును గూర్చి చెప్పిన మాటల భావమును మనము గ్రహించుకొనగలము (యోహాను 1:29). వందల కొలది సంవత్సరములు మట్టుకు యూదులు పస్కాలో గొర్రెప్లిలను బలిగా వధించిన యట్లే యేసుక్రీస్తు కూడా పండుగలో యెరూషలేములో సిలువ వేయబడుట గొప్ప విశేషం.

శతాబ్దముల తరబడి యూదులు అసంఖ్యాకమైన జంతుబలులు అర్పించుచు వచ్చుటచే దేవునికి బలి యర్పించే ప్రాధాన్యత వారి మనసులలో చెరగకుండా ముద్రితమై యున్నది. అది మానవ హృదయములో సార్వజనికముగా భార భరితమైన పాపము యొక్క అవగాహనయే గాక, దానినుండి విమోచన, పాపక్షమాపణ, శాంతికొరకు చేసే అంగలార్పు. అయితే విషాదమేమంటే, వందలాది సంవత్సరముల మట్టుకు సిద్ధపరచబడిన వారు క్రీస్తు మరణము యొక్క భావమును త్వరగా గ్రహించుకొని, అంగీకరించుటకు బదులు దానిని తిరస్కరించిరి. అందువలన సిలువ వేయబడిన క్రీస్తు వారికి ఆటంకమాయెను (1కొరింథీ 1:23). అయితే ఒక విపరీతమేమంటే మానవుడు తనకున్న జ్ఞానమను బట్టి నిజస్వరూపము నెంచుకొనుటకు బదులు ఛాయనే ఎంచుకొనుచున్నాడు. పూర్ణమునకు బదులు సంధితమునే ఎంచుకొనుచున్నాడు. అందువలన యేసు యొక్క స్వజనులలో అనేకులు నేటికిని ఆ ఛాయా రూపకములనే వెంబడించు చున్నారు. అయితే సూర్యోదయం కాగానే నీడలన్నీ ఎట్లు తొలగి పోతాయో అట్లే విధిరూపమైన ఆజ్ఞలు గల మోషే ధర్మశాస్త్రము, ఈలోకపు వెలుగైన క్రీస్తు రాగానే తొలగిపోయెను. క్రీస్తు సంఘమును కలుషితము చేయుటకు, భ్రష్టత్వము పాలు చేయుటకు ఆ పురాతన విధులు, ఆజ్ఞలు దరిమిలా ఎట్లు కొనితేబడెనో వచ్చే సంచికలలో నేర్చుకొందము.

9.

## క్రొత్తనిబంధన

పాతనిబంధన సందర్భములు క్రీస్తు వైపు ఎట్లు సూచించుచుండెనో, అట్లే క్రొత్తనిబంధన కూడ క్రీస్తు తట్టు వెనుకకు సూచించుచున్నది.

- "అయితే మేము సిలువ వేయబడిన యేసుక్రీస్తును ప్రకటించు చున్నాము" (1కొరింథీ 1:23).
- "యేసుక్రీస్తును, అనగా సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని మీ మధ్య నెరగకుందునని నిశ్చయించుకొంటిని" అని అపొ.పౌలు చెప్పెను (1కొరింథీ 2:2).
- "నేను క్రీస్తుతో సిలువ వేయబడి యున్నాను" (గలతీ 2:20).
- "అయితే మన ప్రభువైన యేసక్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక; దాని వలన నాకు లోకమును, లోకమునకు నేనును సిలువ వేయబడియున్నాము" (గలతీ 6:14).
- "క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువ వేసియున్నారు" (గలతీ 5:24).
- క్రీస్తులోనుండి "తప్పిపోయిన వారు తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువ వేయుచు, బాహాటముగా ఆయనను అవమాన పరచు చున్నారు" (హెబ్రీ 6:6).

ఈ పాఠములో దిగువ సంగతులు నిర్ధారించబడినవి. 1. క్రీస్తు సిలువమీద చనిపోయినప్పుడు పాప పరిహారార్థ బలిగా తన రక్తమును అర్పించెను. 2. ఈ ముఖ్యాంశమును బట్టి మిగతా మతముల కంటే క్రైస్తవ్యము, మిగతామత నాయకులందరికంటే క్రీస్తు భిన్నముగా యున్నారు. 3. ప్రవచనములు మూలముగను, ఛాయా రూపకమైన ఉదాహరణల ద్వారాను పాతనిబంధన క్రీస్తును ముందుకు సూచించుచున్నది. 4. క్రొత్తనిబంధన క్రీస్తువైపు, సిలువవేయబడిన

క్రీస్తువైపు వెనుకకు సూచించుచున్నది.

గమనిక : మనకు బదులు క్రీస్తు బలియాయెను. మనము పాపము చేసినందున మరణ శిక్షకు పాత్రులము. అయితే మన స్థానములో క్రీస్తు మనకు బదులు సిలువ వేయబడెను. గనుక క్రైస్తవ జీవితమును జీవించుటలో అపొ.పౌలు వలే మనము ఆయనతో కూడ సిలువ వేయబడాలి (గలతీ 2:20).

- జాషువా గూటం.

## సత్యవాక్యమును సరిగ విభజించుట
## ( Rightly dividing the Word of Truth )

"దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్తపడుము" (2తిమోతి 2:15). పౌలు పలికిన తుది పలుకులలో ఇది ఒకటి.

రెండు సంగతులను మీరు గమనించగోర్తాను: సత్య వాక్యమును సరిగా విభజింపకపోవుట సాధ్యము. లేనియెడల ఈ ఆజ్ఞ ఇయ్యబడకపోవును. సత్యవాక్యమును సరిగా విభజింపవలెనంటే, మనము వాక్యమును పఠించవలెను. మనము దేవుని వాక్యమయిన బైబిలు గ్రంధమును జాగరూకతతో చదువవలెను.

బైబిలు దేవుని వలన కలిగినదని ఇదివరకే గ్రహించి యుంటిమి. ఆయన మనతో విపులముగా మాటలాడెను. మూఢులైనను దానిలో నడచుచు త్రోవ తప్పక యుందురు అని యెషయా 35:8లో ప్రకటింపబడెను. ఆ గ్రంధమును దేవుడు ఒక ప్రయోజనము కొరకు లిఖించెను. యేసుక్రీస్తును, రక్షణమార్గమును మనకు బయలు పరచుటయే దాని ప్రయోజనము.

## 11.
# బైబిలు కేంద్రబిందువు సిలువ

బైబిలునందలి ప్రతి విషయము క్రీస్తు సిలువను సూచించు చున్నది. క్రీస్తు కొరకు, ఆయన సిలువకొరకు పాతనిబంధనఎదురు చూచుచున్నది. క్రొత్త నిబంధన యేసుక్రీస్తు యొక్క జీవితమును, ఆయన మహిమగల మరణమును చూపించుచున్నది. సంఘము దాని బోధలోను, ఆచారములోను క్రీస్తు సిలువవైపు చూచుచున్నది. "సువార్తను బోధించుము" అనునది సంఘమునకీయబడిన సార్వజనిక ఆజ్ఞయైయున్నది. సువార్త అనగా క్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానము అని పౌలు బోధించుచున్నాడు (1కొరింథీ 15:1-4). సువార్త ప్రకటనతో కూడ బాప్తిస్మమను ఆజ్ఞ సర్వవ్యాప్తమై యున్నది (మార్కు16:16). మనము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని పౌలు చెప్పుచున్నాడు; ఆయనతో పాతిపెట్టబడి, ఆయనతో లేపబడితిమి (రోమా 6:3,4). ప్రభురాత్రి భోజనములో మన మనస్సులొకమారు క్రీస్తు యొక్క శ్రమలను గూర్చి ఘోర మరణమును గూర్చి తలంచుకొను అవకాశము కల్గుచున్నది. "నన్ను జ్ఞాపకము చేసుకొనుటకై దీనిని చేయుడని"ఆయన చెప్పెను. "మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు" అని పౌలు పలికెను (1కొరింథీ 11:26).

దేవుని గ్రంధమయిన బైబిలు మానవులకు వ్రాయబడెను. అందొక భాగము ఆయా వ్యక్తులకును, ఎక్కువ భాగము ఒక జనాంగమునకును, మరికొంత భాగము మానవులందరికిని వ్రాయబడెను. మనము బైబిలును చదువునప్పుడు మనలో మనము కొన్ని ప్రశ్నలడుగ వలెను: దేవుడు ఎవరితో మాట్లాడుచున్నాడు ? దేవుడు ఒక ఓడను నిర్మించమని నోవహుకు చెప్పినప్పుడు, ఆయాజ్ఞను ఆయన మరి యెవరికిని ఇయ్యలేదు. అందువలన మనము కూడా ఒక ఓడను నిర్మించి జలప్రళయము కొరకు కనిపెట్టుకొనుట బుద్ధిహీనత యగును. మనము సత్య వాక్యమును సరిగా విభజింపలేని వారము అగుదుము. మనము ఆదికాండము

22వ అధ్యాయాన్ని చదివి మన కుమారుని బలిగా అర్పించ ప్రయత్నించిన యెడల నరహత్యకు కారకులగుదుము. అబ్రాహామును తప్ప మరి యెవరిని అట్లు చేయమని దేవుడు కోరలేదు.

## ధర్మశాస్త్రము ఇశ్రాయేలు జనాంగమునకీయబడెను

అది విశ్వాసమునకొక మాదిరియైయున్నది. దేవుడు చెప్పిన రీతిగ చేయుటకు అబ్రాహాము ఎట్లు లోబడెనో అట్లే దేవుడు మనకు ఆజ్ఞాపించిన రీతిగ మనమును లోబడవలెను. అట్లు 2500 సంవత్సరముల పాటు దేవుడు మనుష్యులతో సంప్రదించెను. ఆయన వేర్వేరు వ్యక్తులతో మాట్లాడెను. తన చట్టమును కుటుంబ యజమానులకు (గోత్రకర్తలకు) బయలుపరచెను. ఆయన ఆదాము, నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపులతో మాట్లా డెను.

ఆ తరువాత దేవుడొక జనాంగముతో మాటలాడెను. అది ఇశ్రాయేలు జనాంగము. ఆయన సీనాయికొండపై వారికొక ధర్మ శాస్త్రము నిచ్చెను. ఆ ధర్మశాస్త్రమును ఆయన వేరొక జనాంగమున కెన్నడు ఈయలేదు. అందువలన అబ్రాహాము నోవహుల కిచ్చిన ఆజ్ఞలే నాకును వర్తించునని ఎవడైనను తలంచుట ఎంత అసంగతమో మోషే ధర్మశాస్త్రమును గూర్చి అన్యజనులు అట్లే తలంచుటకూడా అంతే అసంగతమగును.

కేవలం నా మాటలే మీరు ఈ విషయంలో అంగీకరించ నవుసరం లేదు. గాని దేవుడు ఏమి చెప్పుచున్నాడో వినండి: "నీ దేవుడైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తు దేశములో నుండి నిన్ను వెలుపలికి రప్పించితిని" (నిర్గమ 20:2). ఐగుప్తులో ఎవరుండిరి ? ఇశ్రాయేలీయులు. దేవుడు వెలుపలికి ఎవరిని రప్పించెను ? ఇశ్రాయేలీయులనే కదా ? గనుక ఈ నిబంధనను దేవుడు ఇశ్రాయేలీయులతో చేసెను. దేవుడు పలుకుచుండగా మరల వినండి. "మరియు యెహోవా మోషేతో ఇట్లనెను: ఈ వాక్యములను వ్రాసికొనుము; ఏలయనగా

ఈ వాక్యములను బట్టి నేను నీతోను ఇశ్రాయేలీయులతోను నిబంధనచేసి యున్నాను. అతడు నలుబది రేయింబగళ్ళు యెహోవాతో కూడ అక్కడనుండెను. అతడు భోజనము చేయలేదు, నీళ్ళు త్రాగలేదు; అంతలో ఆయన నిబంధన వాక్యములను అనగా పది ఆజ్ఞలను ఆ పలకమీద వ్రాసెను" (నిర్గమ 34:27,28).

## అన్యజనులకీయలేదు

ఈ నిబంధనను ఆయన అన్యులతో ఎవరితోనైన చేసెనా ? చేయలేదు! ఈ నిబంధన ఇశ్రాయేలుతో చేసితిని అని ఆయన చెప్పుచున్నాడు. ఇశ్రాయేలీయులను సంబోధించుచూ దేవుడిచ్చిన ఆజ్ఞలనేకములను మీకు నేను చూపించ గలను గాని వాటిలో ఏ ఒక్కదానిలోనైనను ఆయన అన్యజనులను ఇమడ్చలేదు. మన పాఠ్యభాగము మీకు గుర్తున్నదా ? "దేవునియెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కర లేని పనివానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము". దేవుడు ఆజ్ఞాపించని ఆజ్ఞలకు ప్రజలను బద్ధులనుగా చేయుదమా ? అన్యజనులు కూడ సున్నతి పొందవలెనని కొందరు బోధించుటకు మొదలిడగా, "మన పితరులైనను, మనమైనను మోయలేని కాడిని శిష్యుల మెడమీద పెట్టి మీరెందుకు దేవుని శోధించుచున్నారు ?" అని పేతురు జవాబిచ్చెను (అపొ.కా. 15:10). ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకు ఈయబడెను. దానిని శిష్యులపై మోపరాదని పేతురు చెప్పుచున్నాడు.

దేవునిరాజ్య తాళపుచెవులను పేతురు కలిగియుండెను, అతడు సర్వసత్యము లోనికి నడిపింపబడు నిమిత్తము పరిశుద్ధాత్మలో బాప్తిస్మమును పొందెను. యోహాను 16:13-16; 14:26లను చదువండి. క్రీస్తు బయలు పరచిన దానినే పరిశుద్ధాత్ముడు పలికెను. "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మవచ్చి నప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటినిబోధించి సంభవించ

బోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13). అయితే శిష్యులెవరు? వాక్యమునుండే జవాబును కనుగొందాము: "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" (అపొ.కా. 11:26). గనుక మోషే ధర్మశాస్త్రమును క్రైస్తవులపై మోపరాదని పరిశుద్ధాత్ముడు ఖచ్చితముగా హెచ్చరించెను. అట్లు మోప ప్రయత్నించు ప్రతివాడు సత్యవాక్యమును సరిగా విభజింపలేక పోవుటయే గాక దేవుని పరిశుద్ధాత్ముని దూషించిన వాడగుచున్నాడు.

## క్రైస్తవ సబ్బాతు ?

ఆజ్ఞలన్నిటికంటే పది ఆజ్ఞలలో యున్న నాలుగవ ఆజ్ఞకు ఎక్కువ ప్రాధాన్యత ఈయబడినది. "విశ్రాంతి దినమును పరిశుద్ధ దినముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" (నిర్గమ 20:4).క్రైస్తవులమని చెప్పుకొను వేలకొలది ప్రజలు క్రైస్తవ సబ్బాతును గూర్చి మాట్లాడుదురు. అట్టిదానిని గూర్చి బైబిలునందు మీరు ఎన్నడైనా చదివారా ? చదువలేదు. క్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములపై క్రైస్తవ్యము ఆధారపడి యున్నది. ఈ వాస్తవములు ప్రకటింపబడి, విశ్వసింపబడువరకు ఏ మానవుడు కూడా క్రైస్తవుడు అని పిలువబడలేదు. క్రీస్తు ఆదివారమున, అనగా సబ్బాతు దినమై పోయిన తరువాత దినమున మృతులలో నుండి లేచెను (మార్కు 16:1-2). సంఘారంభ దినమగు పెంతెకొస్తుదినము ఎల్లప్పుడు వారములో మొదటి దినముననే, అనగా సబ్బాతుదినము తరువాతనే వచ్చెను (లేవీ 23:15-21).

క్రైస్తవులు ఆచరించవలసిన దినము ఆదివారము అని మనము తెలిసికొన్నాము. సబ్బాతు ఇశ్రాయేలీయులకే ఈయ బడెనను సంగతిని దైవవేదము నుండి ఇప్పుడు తెలిసికొందాము: "మరియు యెహోవా మోషేతో ఇట్లనెను: నీవు ఇశ్రాయేలీయులతో నిజముగా మీరు నేను నియమించిన విశ్రాంతి దినములను ఆచరించవలెను" (నిర్గమ 31:12). సబ్బాతును ఆచరించవలెనని ఆయన అన్యుని

కెన్నడయినను చెప్పెనా ? లేనేలేదు; ఇశ్రాయేలీయులు దానినాచరింపవలెనని ఆయన చెప్పెను. నెహెమ్యా ద్వారాఇప్పుడు దేవుని స్వరమును విందము: " సీనాయి పర్వతము మీదకి దిగివచ్చి ఆకాశము నుండి వారితో మాటలాడి, వారికి నీతియుక్తమయిన విధులను సత్యమైన ఆజ్ఞలను మేలు కరములైన కట్టడలను నీవు దయచేసితివి. వారికి నీ పరిశుద్ధ దినమైన విశ్రాంతి దినమును ఆచరించనాజ్ఞ యిచ్చి నీ దాసుడైన మోషే ద్వారా ఆజ్ఞలను, కట్టడలను, ధర్మశాస్త్రమును వారికి నియమించితివి" (నెహెమ్యా 9:13). సీనాయి పర్వతము మీద దేవుడెవరితో మాటలాడెను ? ఇశ్రాయేలీయులతోనే గదా. మరియు వారికే ఆయన తన పరిశుద్ధ విశ్రాంతి దినమునిచ్చెను. మన వాక్య పఠనములో, సబ్బాతు క్రైస్తవ యుగమునకు కాదుగాని, సీనాయి కొండమీద ఇయ్యబడిన ధర్మశాస్త్రమునకు చెందినదని గ్రహించాము. ఆ ధర్మశాస్త్రమును శిష్యుల మెడ మీద మోపరాదని పేతురు బోధించాడు.

## మధ్యగోడ పడగొట్టబడెను

ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకే తప్ప అన్యజనుల కెవరికినీ ఇయ్యబడ లేదను ఈ వాస్తవము మీకింకా తేటపరచబడకపోతే, పౌలు ద్వారా పరిశుద్ధాత్ముడు పలికిన పలుకులను మీరు గమనించండి: "కాబట్టి మునుపు శరీర విషయములో అన్యజనులై యుండి, శరీరమందు చేతితో చేయబడి సున్నతి లేనివారనబడిన మీరు, ఆకాలమందు ఇశ్రాయేలీయులతో సహ పౌరులుకాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణ లేనివారును, లోకమందు దేవుడు లేనివారునైయుండి, క్రీస్తుకు దూరస్థులై యుంటిరని మీరు జ్ఞాపకము చేసు కొనుడి" (ఎఫెసీ 2:12). ఇంత విపులముగా ఇంకేమికలదు ?

అన్యజనులు, పరజనులు నిరీక్షణ లేనివారు, దేవుడు లేనివారైయుండిరి. అయితే అందులో మార్పువచ్చెనా ? అవును. ఇప్పుడు వినండి "అయినను మునుపు

• దూరస్థులైనమీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు" (ఎఫెసీ 2:13). ఇప్పుడు మనము క్రీస్తు రక్తమువలన ఇకమీదట ఎన్నడు పరజనులుగను, నిరీక్షణ లేనివారముగనులేము. మనము నిరీక్షణను, దేవుని కలిగి యున్నాము. సిలువమీద క్రీస్తు తనరక్తమును చిందించగా సిలువ యొద్ద మనకు దొరికిన ఈగొప్ప భాగ్యములోనుండి మొదటి నిబంధనలో యున్నవారు తొలగించబడిరా ? లేదు. మనము తరువాత వచనమును చదువుదాం: "ఆయన మన సమాధానమై యుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధి రూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్యగోడను పడగొట్టి, మన ఉభయులను ఏకము చేసెను" (2:14). క్రీస్తునందు మానవులను దేవుడు తమ తమ జాతిని బట్టి గుర్తించడు. ఇప్పుడు యూదుడని, గ్రీసుదేశస్థుడని లేదు (గలతీ 3:28). వారిద్దరు ఇప్పుడు ఏకమై యున్నారు. మొదటి నిబంధనను తీసివేయుట ద్వారా, లేదా మధ్య గోడను పడగొట్టుట ద్వారా దేవుడు ఈ ఏకత్వమును సాధ్య పరచెను.

ఆ మధ్యగోడ ఏమైయుండెను ? అది విధి రూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రము అని మనము చదివి యుంటిమి. అది ఎత్తివేయబడెను. అయితే అది ఎప్పుడు ఎత్తివేయబడెను ? అది సిలువద్వారా ఎత్తివేయబడెను. అని పౌలు చెప్పుచున్నాడు(ఎఫెసీ 2:16). నీవు దేవునితో సమాధానపడ గోరుచున్నావా? అయితే ధర్మశాస్త్ర సహాయము నభ్యర్థింపవద్దు. అది క్రీస్తునందు కొట్టివేయబడెను. దైవ గ్రంథము నుండి మరొకసారి చదువుకొందము: "మరియు వారి మనస్సులు కఠినములాయెను గనుక నేటివరకును పాత నిబంధన చదువబడునప్పుడు, అది క్రీస్తు నందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక, ఆ ముసుకే నిలిచి యున్నది" (2కొరింథీ 3:14).

## 17.

## అయితే ధర్మశాస్త్రమెందుకు ?

బహుశా మీరు నన్నీ ప్రశ్న అడగాలనుకొనుచున్నారు: "మనము ధర్మశాస్త్రము వలన రక్షణ పొందలేని యెడల దాని ప్రయోజనమేమిటి ? దేవుడే మీ ప్రశ్నకు జవాబిచ్చును: "కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను. గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతీ 3:24,25). రాబోవు రక్షకుని కొరకు ప్రజలను సిద్ధపరచు నిమిత్తము దైవజ్ఞానముచే వారికొక బాలశిక్షకుని దేవుడనుగ్రహించెను. ఆ బాలశిక్షకుడు ధర్మశాస్త్రము. మనమిక మీదట ఆ బాలశిక్షకుని క్రింద ఉండము. అని అతడు చెప్పుచున్నాడు. మనము క్రీస్తును సేవిస్తూ ధర్మశాస్త్రము నకు కూడా లోబడియుండలేమా? యని కొందరడుగవచ్చును. మరల దేవునినే జవాబీయ నిద్దాం: "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులోనుండిబొత్తిగావేరు చేయబడి యున్నారు, కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతీ5:4). మరల దేవుడిట్లనుచున్నాడు: "ధర్మ శాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు. ఎందుకనగా ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడి యున్నది" (గలతీ 3:10). ఇవి విపులముగా చెప్పబడిన మాటలు. అవి నిత్యదేవుని మాటలు.

నీకొరకై మృతినొందిన వానికి నీవు విధేయుడవగుదువా? అయితే ఆయన వాక్యమును సరిగ విభజించుము. కుటుంబ యజమానుల కిచ్చిన ఆజ్ఞలకును, ఇశ్రాయేలీయుల కిచ్చిన ఆజ్ఞలకును మధ్య సీనాయి పర్వతము ఎట్లున్నదో అట్లే ధర్మశాస్త్రము నకును, కృపకును మధ్య సిలువయున్నది. యేసునందే రక్షణ యున్నది (అపొ.కా. 4:12). గనుక మనమాయన మాటలను వినవలెను. మనము ధర్మశాస్త్రము నొద్దకు తిరిగి వెళ్లిన యెడలక్రీస్తును పోగొట్టుకొందుము.

క్రీస్తు మృత్యువును జయించి విజేయుడై లేచినప్పుడు, "పరలోక మందును, భూమిమీదను నాకు సర్వాధికారమీయబడి యున్నది" అని చెప్పెను (మత్తయి 28:18). అట్లయిన ధర్మశాస్త్రము నిరర్థకము చేయబడెను. ఆయన జీవించు చున్నప్పుడు ధర్మశాస్త్రము ప్రకారము జీవించెను. ఏలయనగా సిలువ యొద్దకు ఆయన వచ్చు వరకు ఆయన దానికంతమొనర్చలేదు. ఆయన జీవించుచున్నప్పుడు యూదుల మధ్య ఆయన బోధించెను. తన స్వజనమునకు బోధించు నిమిత్తము తన శిష్యులను ఆయన పంపెను. మత్తయి 10:5,6లో ఆయన తన శిష్యులను ఇశ్రాయేలీయుల వద్దకే గాని, అన్యుల యొద్దకు, సమరయుల యొద్దకు వెళ్ళుమని ఆజ్ఞాపించలేదు. అయితే సిలువకు ఇవతల నిలుచుండి మరల అదే శిష్యులను ఆయన ఇట్లు ఆజ్ఞాపించెను: "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి" (మత్తయి 28:19).

అయితే ఈ వ్యత్యాసమెందుకు ? వాటిమధ్య గతించినవి కొన్ని నెలలే గదా? యేసు అదే మనుష్యులతో మాట్లాడుట మనము చూచుచున్నాము. ముందయితే శిష్యులు అన్యజనులకు, సమరయు లకు బోధించరాదని ఆయన ఆజ్ఞయిచ్చెను. కాని ఇప్పుడు సమస్త జనులకు సువార్త బోధించుమని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు. అయితే ఏమి జరిగెను? యేసు మరణించెను. ఇశ్రాయేలీయుల కీయబడిన ధర్మశాస్త్రము అంతమాయెను. యేసు యూదునికి, అన్యునికి రక్షకుడు. ఆయనలో పక్షపాతము లేదు.

దేవుని వాక్యము సరిగ విభజించుట కనుగొనుటెట్లో తెలుసు కొనుటకు ఇంకా మనకు ఋజువు కావలెనా ? నేను చూపించిన ఋజువు కొద్ది మాత్రమైనదే గాని దైవవేదము ఈ విషయమైఎక్కువ బోధించుచున్నది.

## మనము క్రీస్తు మాటలను వినవలెను

దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్ముడు ఎల్లప్పుడు ఏకమై పని చేయుదురు. మనము

క్రీస్తును ఆయన ఆత్మ శబ్దమును విన్నాము గనుక దేవునినుండి కూడ బుజావును వింటము. యేసు కొండమీద రూపాంతరముపొందినపుడు ఆయన మోషే ఏలియాలతో మాట్లాడు చుండగా ఆ నిత్యదేవుడు మాటలాడెను. మోషేకు ఒకటి, ఏలియాకు ఒకటి, క్రీస్తుకు ఒకటి మూడు పర్ణశాలలు (ఆరాధనా స్థలములు) నిర్మించుదము అని పేతురు సలహానిచ్చెను. యేసుకూడ మోషేతో కలసి పరిపాలించాలని దేవుడు తలంచినట్లయితే ఈ సలహాకు దేవుడు మద్దతు ఇచ్చి యుండును. గాని అట్లుకాలేదు! శతాబ్దముల తరబడి దొర్లుచున్న దేవుని శబ్దమును వినుము: "ఈయన నా ప్రియకుమారుడు, ఈయన మాట వినుడి". 1500 సం॥ల క్రితము ప్రజలు మోషే ధర్మశాస్త్రము ననుసరింపవలెనని ఆయన ఆజ్ఞా పించెను. అయితే యిప్పుడు, "నా కుమారుని మాట వినుడి" యని ఆజ్ఞాపించు చున్నాడు. దేవుడు తన మనస్సు మార్చుకొనలేదు గాని, ధర్మశాస్త్రము దాని ప్రయోజనమును పూర్తిచేసెను. అది రాబోవు మేలులు ఛాయగలది మాత్రమే (హెబ్రీ 10:1).

## ముగింపు

దేవుని వాక్యమందున్న బుజావులను ఇప్పుడు పొందు పరచుదము. మానవుడు పాపము చేసెను. దేవుడతనిని విమోచించుటకు సిద్ధపడెను. ఆయన తన రక్షణ మార్గమును సిద్ధపరచెను. మొదట, కుటుంబ యజమానులతో మాట్లాడెను. కాలము పరిపూర్ణ మయినప్పుడు ఆయనఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి విడిపించెను. సీనాయి పర్వతము మీద ఆయన వారికొక ధర్మశాస్త్రము నిచ్చెను. క్రీస్తునొద్దకు వారిని నడిపించుటకు అది వారికి బాలశిక్షకు డాయెను. కాలము పరిపూర్ణ మయినప్పుడు క్రీస్తు వచ్చెను. ఆయన ధర్మశాస్త్రము క్రింద జన్మించి, జీవించెను. ఆయన రాజ్యముకొరకు ఆయన లోకమును సిద్ధపరచుచుండినను, సిలువయొద్దకు వచ్చు వరకు ధర్మశాస్త్రము నిరర్థకము కాలేదు. మనము మోషే ఏలియాలను గాక దేవుని కుమారుని మాటలను

వినవలెనని దేవుడు ప్రకటించెను. క్రీస్తు మృతులలోనుండి లేచిన తరువాత సమస్తాధికారము నాదియని ప్రకటించెను. పరిశుద్ధాత్ముడు దీనితో ఏకీభావమును వ్యక్తపర్చెను: "యేసుక్రీస్తు మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింప బడెను" (రోమా 1:4). క్రీస్తు అధికారమును పొందినప్పుడు, సమస్తాధికారము ఆయనకీయబడెను. అందువలన ఆయన స్వరమునకే మనము లోబడవలెను. "పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాటలాడెను" అని పరిశుద్ధాత్ముడు పలికెను(హెబ్రీ 1:1).

నీవు క్రైస్తవునిగా నుండగోరుచున్నావా? అయితే యేసు యొక్క మాటలను వినుము. నీపై ఆయనకు మాత్రమే యున్న అధికారమునకు లోబడుము. ఆయన వాక్యమునకు కలుపుటగాని, తీసివేయుటగాని చేయవద్దు.

- జె.పి. బెయిలీ.

## ఎవరు పూజార్హుడు మరియు పరిశుద్ధుడు ?
## (Holy and Reverend, Who ? )

దేవుడొకడు పరలోకమందున్నాడు (దానియేలు 2:28). ఈ దేవుడు మనకు సదాకాలము మనకు దేవుడై యున్నాడు (కీర్తన 48:14). మన దేవుడు గొప్ప దేవుడు "నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు నేను తప్ప ఏ దేవుడును లేడు" (యెషయా 45:5). "నేను మొదటివాడను కడపటివాడను నేను తప్ప ఏ దేవుడును లేడు" (యెషయా 44:6). ఆదికాండము 17:1వ వచనమునందు నేను సర్వశక్తి గల దేవుడను అని దేవుడు చెప్పుటను మనము చదువగలము. ఇది దేవుని గొప్ప తనమును తెలియజేయుచున్నది. మనము తప్పక ఆయనను స్తుతించి గౌరవించాలి. ఆయన నామమును వ్యర్థముగా తీసికొనకూడదు.

21.

## ఘనత దేవునికే చెందును

మనచుట్టూ పరికించి చూచినచో చాలామంది దేవుని నామమునును వ్యర్థముగా ఉచ్ఛరించుటను మనము కనుగొనగలము. మరికొందరు ఆయన పరిశుద్ధ నామమును విడిచిపెట్టుచున్నారు. కీర్తన 111:9 నందు కీర్తనాకారుడు ఈ విధముగా చెప్పెను: "ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపతగినది" (Holy and Reverend is His Name ). దేవుని నామము పరిశుద్ధమైనది పూజింపతగినది అని స్ఫటికమంత స్పష్టముగా చెప్పబడెను; అయినను చాలామంది మత నాయకులు వారి అంతట వారే ఆ పేరుతో పిలువబడుచున్నారు. రెవరెండ్ అను నామము సర్వశక్తిమంతుడైన దేవునికే చెందును. మానవమాత్రులమైన మనము రెవరెండుల (పూజార్హులు) మని పిలువబడుటకు తగినవారమా ? దేవుడు మాత్రమే పూజింపతగిన వాడు గనుక రెవరెండు అను నామము ఏ మనుష్యుడును ధరించుకొనుటకు తగినవాడు కాదు. ఒకవేళ నన్ను నేను రెవరెండుగా కనబరచు కొనినట్లయితే నన్ను నేనే హెచ్చించుకొనువాడనగుదును. మన మట్టుకు మనము రెవరెండ్ అను చెప్పుకొనుటవలన మేము మీకంటె చాలా ఎక్కువ స్థాయివారము అని ప్రజలతో చెప్పినట్లగుచున్నది. మన దేవుడు పరిశుద్ధుడు, పూజార్హుడు కాబట్టి మనమందరము అట్టి దేవునికి ఘనపరచవలెను, ఘనతను ఆయనకివ్వవలెను. నేనొక సామాన్య మానవుడను సర్వశక్తిమంతుడైన దేవునితో నన్ను నేను సమానునిగా చేసుకొనను. నేను ఎప్పుడు రెవరెండ్ అను పేరును ధరించెదనో అప్పుడు దేవుని సామర్థ్యము గల నామమును దూషించువాడను, విసర్జించువాడను అగుదును.

ఈ లోకములో మత సంబంధమైన గందరగోళము చాలా కలదు. బైబిలు లోని చాలా విషయములను గూర్చి ప్రజలు తికమక పడుచున్నారు. ఈ మత సంబంధమైన గందరగోళము పూజాధికిలు (క్లర్జీ) మరియు సామాన్యులు (లైటీ) అను పద్ధతిని అనుసరించుట వలన ఉద్భవించినది - రెవరెండు (పూజార్హుడు)

అను పేరు పూజాధికుల స్థాయినుండి ఉత్పన్నమైనది. లైటీ అనునది క్లెర్జీ స్థాయి వారి కంటె తక్కువ స్థాయివారు. ఈ సిద్ధాంతము లేక బోధల ప్రకారము రెవరెండ్స్ ప్రత్యేక స్థాయికి చెందిన ప్రజలును మరియు లైటీ (సామాన్యుల) కంటె అధికులైనవారు. మనము బైబిలునందు క్లర్జి మరియు లైటీ అను వాటిని కనుగొనగలమా ? సంఘము స్థాపించబడినప్పటినుండి అందు పూజార్హులు - సామాన్యులు అనునది లేదు. ఇది మనుష్యుని యొక్క బోధ.

## క్రీస్తు మత మత బిరుదులను ఖండించెను

ఎవరినైననూ హెచ్చించువాడు, ప్రశంసించువాడు మరియు గౌరవించువాడు దేవుడొక్కడే. ఒకప్పుడు మన ప్రభువు యూద మతనాయకులను అధికార పూర్వకముగా గద్దించెను. ఈ యూదా మత నాయకులు తమను తామే ప్రశంసించు కోనుచుండిరి. ఈ మత నాయకులు రబ్బీ మరియు తండ్రి అను పేర్లను తమకు తామే ధరించి పిలుపించుకొనుచుండిరి. "మీరైతే బోధకులని పిలువబడవద్దు, ఒక్కడేమీ బోధకుడు, మీరందరు సహోదరులు; మరియు భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు" అని యేసు చెప్పెను (మత్తయి 23:6-10). మన ప్రభువు, మన గురువు తన్ను తాను హెచ్చించుకొనలేదు. తన్ను తాను తగ్గించుకొనెను. ఆయన ఈలాగు చెప్పెను. "మీలో అందరికంటె గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును; తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును" (మత్తయి 23:11-12).

బైబిలులో ఎక్కడైనను అపొస్తలుడైన పౌలు లేక అపొస్తలుడైన పేతురు ఒకరినొకరు రెవరెండ్ పౌలు అని రెవరెండ్ పేతురు అని సంబోధించుకొనుటను మనము చదువలేదు. మత సంబంధమైన నాయకులు రెవరెండ్ అను పేరు ధరించుట బైబిలునందు కానరాదు. "ఆయన దేవుని స్వరూపము కలిగిన

వాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచి పెట్టుకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందువంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:6-8). మార్కు 10:17-18 వచనములందు యేసువొద్దకు వచ్చి "సద్బోధకుడా", అని సంబోధించిన ధనవంతుని గూర్చి చదువగలము. క్రీస్తు అతనితో ఏమి చెప్పెనో నీవెరుగుదువా ? "యేసు - నన్ను సత్పురుషుడని యేల చెప్పుచున్నావు ? దేవుడొక్కడే గాని మరి ఎవడును సత్పురుషుడు కాడు". అణకువ సంపూర్ణ మాదిరిని ఆయనయందు చూడగలము. యేసుక్రీస్తు ఎప్పుడును తన్ను తాను హెచ్చించుకొనలేదు. ఆయన సమస్తమైన సాధు వర్తనతో సేవచేసెను.

తీర్పు దినము ఒకటి ఉన్నది. మనమందరము ఆ దినమున క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలెను (2కొరింథీ 5:10). మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్కయొప్పగింపవలెను (రోమా 14:12). తీర్పు దినమున మనము ఆయన ఎదుట ఏలాగు నిలచియుందుము ? రెవరెండ్‌గా ఆయన ముందు నిలచి యుందువో లేక ఒక సామాన్య క్రైస్తవునిగా నిలిచియుందువో కొంచెము ఆలోచించుము. దేవుని నామమును వ్యర్థపరచవద్దు. దూషించవద్దు. ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపతగినది. నీ నామము నా నామము కాదు, దేవుని ఎదుట మానవమాత్రులమైన మనము పురుగువంటివారము. "యెహోవా మా ప్రభువా, ఆకాశములతో నీ మహిమను కనపరచువాడా భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది ?" (కీర్తన 8:1-4).

- ఫ్రాన్సిస్ డేవిడ్, న్యూఢిల్లీ.

24.

# అతనికున్నదంతా క్రీస్తే
## (All he got was Christ )

క్రైస్తవ్యము నుండి సాధు సుందర్‌సింగ్ సంపాదించినదంతా క్రీస్తేయని చెప్పబడింది. అతడు సిక్కుల మతానికి చెందినవాడు. దాన్ని వదిలేయడం అంటే కుటుంబాన్ని, సాంఘిక ఘనతను, ధనార్జన కొరకున్న అవకాశాలన్నిటినీ వదిలేయడం అన్నమాట. అతడా మతాన్ని వదిలేశాడు.అట్టి పరిస్థితుల్లోనే యున్నట్టి మరొక వ్యక్తి వెంటనే మనకు జ్ఞాపకం వస్తాడు. అపొస్తలుడైన పౌలు క్రీస్తుకొరకు ఈ లోకంలో యున్నదాన్నంతా కూడ వదిలేసాడు (ఫిలిప్పీ 3:4-6). అతడు విచారించాడా ? లేనేలేదు! "అయినను ఏవేవి నాకు లాభకరములై యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని" యని అతడు చెప్పాడు (ఫిలిప్పీ 3:7). ప్రభువు కొరకు పౌలు చేసిన మనఃపూర్వక త్యాగము, తద్వారా అతనికి కల్గిన సంతోషము అతని వ్రాతలలో ప్రతిబింబించేది. క్రైస్తవ్యంనుండి అతడు పొందినదంతా క్రీస్తే. దానిలో క్షమాపణ సమాధానములున్నవి (కొలస్స 1:20-22).ఈలోకంలో యున్నదంతా వాటిని కొనలేవు. వాటిని మనం సంపాదించుకోకపోతే ఈ లోకం అంతా వ్యర్థమే. మనమేమైనా పోగొట్టుకొంటే ప్రభువు వందరెట్లు అధికంగా మనకు దయచేస్తాడు (మార్కు 10:30). ఒకడు క్రీస్తులో సంపాదించుకొనే కుటుంబం కంటె పెద్దది, ప్రేమ గలది మరొకటి లేదు. దానిలో భద్రత యున్నది (మత్తయి 6:33; హెబ్రీ 13:5). ఘనతయున్నది (యోహాను 12:26). స్వాస్థ్యమున్నది (రోమా 8:17; గలతీ 3:29). దేవుని వారసులు పొంది దానితో పోల్చుటకు ఈ భూమిమీద యేమీలేదు.

అంతేగాకుండా సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానం మనకు దొరుకుతుంది (ఫిలిప్పీ 4:7). నిజమైన స్నేహితునితో స్నేహము (యోహాను15:14; సామె18:24). యే నిరాశలేని నిరీక్షణ మనకు దొరుకుతుంది (హెబ్రీ 6:18,19). క్రీస్తులో లెక్కలేనన్ని యితర ఆశీర్వాదములను మనము పొందుదుము. క్రైస్తవ్యం నుండి నీవు పొందేదంతా క్రీస్తే అయితే నీవు నిజంగా ధనవంతుడవే !

- జిమ్ ఓ. కానర్.

ఆత్మీయాహారమును, క్రైస్తవ సహవాసమును అనుభవించ గలిగిరి. సెమినార్ జరిగిన ప్రతి కూటము అనంతరము క్రీస్తు సువార్తకు లోబడిన వారి సంఖ్య మొత్తము 182 ఆయెను. సెమినార్ ఆఖరిరాత్రి, కూటము అనంతరము హాజరైన వారందరికీ ఒక్కొక్క బైబిలు, నీరుకట్టిన తోటలు అను పుస్తకములు ఉచితముగా అందజేయ బడెను. ఇంచుమించు వెయ్యి బైబిళ్లు ఆరాత్రి అందజేయబడెను. సెమినార్‌లో జరిగిన స్త్రీల కూటములలో సోదరి నేన్సీఫోర్డ్ గారు వాక్య పరిచర్య చేయగా సోదరి సువార్త గారు తెలుగునకనువదించి సహకరించిరి. దేవుని నామ ఘనతార్థమై సెమినార్‌ను ఇంత చక్కగా సమర్థవంతముగా నిర్వహించిన కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ నెహెమ్యా గూటం గారు, వారి బృందము, విద్యార్థులు అభినందనీయులు.

జనవరి 22వ తేదీ శుక్రవారం ఉదయం కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ గ్రాడ్యుయేషన్ మరింత ఘనముగా జరిగెను. ఆ దినము కాకినాడ మునిసిపల్ అధ్యక్షురాలు శ్రీమతి ప్రభాజోసఫ్ గారు ముఖ్య అతిధిగా ఆహ్వానించబడిరి. ఆనాటి గ్రాడ్యుయేషన్ కార్యక్రమమునకు సోదరులు జాన్‌ఫోర్డ్ గారు అధ్యక్షత వహించగా, సోదరులు బిల్ మెయర్స్ గారు పట్టభద్రులు కాబోవుచున్న విద్యార్థులనుద్దేశించి బైబిలు గ్రంథమునుండి చక్కటి హెచ్చరికలనిచ్చిరి. జాన్‌ఫోర్డ్ గారు ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు డిప్లొమోలను ఇయ్యగా, నేన్సీఫోర్డ్ గారు వారికి బహుమతులనందించిరి. ఆనాడు 25 మందికి డిప్లొమోలు అందించబడెను. కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ గారి వందన సమర్పణతోను, జాషువాగూటం గారి ప్రార్థనతోను గ్రాడ్యుయేషన్ కార్యక్రమము పూర్తికాగా, హాజరైన వారందరికి గొప్ప విందు ఏర్పాటు చేయబడెను.

జనవరి 24, 25, 26 తేదీలలో వరంగల్లు పుప్పాలగుట్ట క్రీస్తుసంఘ ఆవరణలో గొప్ప బహిరంగ సువార్త కూటములు జరిగెను. వందలాది ప్రజలు హాజరు కాగా జాన్‌ఫోర్డ్ గారు, బిల్‌మెయర్స్ గారు వాక్యపరిచర్య చేసిరి. నేన్సీఫోర్డ్ గారు నలినిగూటం

గారు స్త్రీల కూటములు నిర్వహించిరి. ఆ కూటములలో 153 మంది క్రీస్తు సువార్తకు లోబడిరి. వరంగల్లు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థులు, స్థానిక సంఘము నెహెమ్యా గూటం గారితో కలిసి గొప్ప కృషి సల్పిరి. ఈ సందర్భములో నెహెమ్యా గూటం గారి యొక్కయు, సోదరులు సత్యం గారి యొక్కయు కృషి శ్లాఘనీయమైనది.

జనవరి 23, 24,25 తేదీలలో సోదరుల జాషువా గూటం, రోయస్ ఫ్రెడరిక్ గార్లు కందరాడ, భీమవరం, నర్సాపురం, మధురపూడి గ్రామములలో పర్యటించి సువార్త ప్రకటింపగా 18 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. మరియు ఈ సంచిక ముద్రించు సరికి 29, 30 తేదీలలో విజయవాడ క్రీస్తురాజ పురంలో జరుగబోయే కూటములకు సోదరులు జాషువా గూటం గారు సతీసమేతముగా వెళ్లుటకు సంకల్పించిరి.

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications, Kakinada - 533 004

**PRINTED BOOK - BOOK POST**

**From:**

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

**To**